
# శ్రీవారి అగచాట్లు

బి. సరోజినీదేవి



అరుణ కిరణ కాంతులు ఆకాశాన్ని వదిలి సృష్టిలో ప్రతి వస్తువుని అప్పుడే వూళ్ళో అడుగుపెట్టిన పాత పరిచయస్తుడు తెలిసినవాళ్ళని పలకరించినట్లుగా తాకుతున్నాయి.

అర్ధరాత్రి దాకా చిరుకోపాలలో, దరహాసాలతో కవ్వింపుల బుజ్జగింపుల సమ్మేళనాలతో ఆనందంగా సతమతమయి ఆఖరి క్షణంలో నిద్రకుపక్రమించే క్షణంలో మానసిక సంఘర్షణ జరిపి నిద్రపోయిన మధుని కూడా భాస్కరుని వెలుగు రేఖలు స్పర్శించాయి. ఆ వెలుగుకి, వాటి చురుకుకి కూడా బదులుగా దుప్పటి తన్ని పెట్టి మంచాన్ని మాత్రం దిగలేము మధు.

కాని శనివారం సుప్రభాతాన్ని మించిన. భజంత్రీల గోలని అనుసరించే భార్య అంట్ల తోముళ్ళతో కలిగే మోతకిమాత్రం లేవక తప్పలేదు అతనికి. అది అతనికిరోజూ వుండేకొలువే అయినా- దాన్ని మార్పించాలనో మాన్పించాలనో ట్రై చెయ్యడం మామూలే అయినా- ఆ రోజు కూడా మధు విధిగా అరిచాడు

"మహాతల్లి! భువనేశ్వరీ! ఆకోపతాపాలు నేను ఆఫీసుకివెళ్ళాక ప్రారంభించడం ఎప్పటికైంచో ఇవ్వాళయినా మనవిచేస్తావా?"

"ఆ! ఆ! ఇంకేం వుంది- లేచారా! లేవగానే 'కాఫీ, కాఫీ' అనడమే 'ఏమే ఏమే' అనడమే విన్నానుగాని- ఇలా విరుచుకుపడడం మనింట్లోనేచూశాను"అంటూ ఘాటుగా రిప్లయి వచ్చింది బెడ్ రూంలోకి- అవతలి కిచన్ రూంలోంచి.

"ఖర్మ-ఖర్మరా! భగవంతుడా! ఛీ! ఛీ మళ్ళీ ఆ వెధవ మాటలెందుకు?" అని దేవుణ్ని తలవడాన్ని నిందించుకుంటూ జారిన లుంగీ సరిచేసుకుని బెడ్ దిగాడు మధు

అలా నడిచి గుమ్మం దగ్గరికి వచ్చిన మధు ఆ ప్రక్కనే వున్న టేబిల్ పైన వుంచిన తన బ్రెష్ వైపు చూపుని తిప్పాడు. బ్రెష్ పైన పేస్ట్ పూసి వుండడాన్ని చూడగానే అతని పెదవులు చిన్నగా విచ్చుకొన్నాయి నవ్వటానికన్నట్లు

"ఈ విషయంలో నీకు నువ్వే సాటి లేవోయ్"అంటూ బ్రెష్‌ని నోట్లోకి పంపించి బాత్ రూంలోకి దారి తీశాడు మధు.

అతను స్నానం కూడా పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు రోజులాగే అమర్చి వున్నాయి బాత్‌రూంలో. మరోసారి నవ్వుకున్నాడు మధు. ఈసారి అతని నవ్వులో కొంచెం శబ్దాన్ని పెంచాడు. అప్పుడే వణ్ళాలు ఇంట్లోకి తీసుకొస్తున్న అతని అర్ధాంగి భువనేశ్వరి చెవుల్ని తాకింది.

"నవ్వులు చాలించి త్వరగా కానీయండి. ఆఫీసుకి టైమ్ అవుతోంది" అని కేక వేసింది.

"ఇదిగో అయిపోయింది!" అని రిప్లై యిస్తూ స్నానాన్ని ముగించాడు మధు. అతను టవల్‌తో తుడుచుకుంటూ పూజగది వైపు నడిచాడు అక్కడి కార్యక్రమం అయిపోయేసరికి టేబిల్‌పైన టిఫిన్ రడీ అయివుంది. దాన్ని ఓ చూపు చూసి లేచేసరికి తను ధరించే కవచాలు రడీ అయి వున్నాయి వాటిని తను ధరించి తలకి ముఖానికి కొంచెం మేకప్ కొట్టి:

"స్వప్నా - స్వప్నా!" అంటూ పిలిచాడు భార్యని.

"ఇంకా ఇక్కడే వున్నారా వెళ్ళరండి!" అంటూ వచ్చింది అక్కడికి అతని భార్య.

"అదికాదు కాంతా! మరి-" అంటున్న అతని మాటలకి అడ్డుపడూ "రాత్రి మీకు ఏం చెప్పాను? నా పేరుతో నన్ను పిలిస్తే పిలవండి లేదా! ఏమే' అని పిలవమన్నానా?" అంది అతన్ని కోపంగా చూస్తూ.

"అబ్బబ్బా! ఏ పేరయితే ఏముంది? మంచి పేర్లే పెడుతున్నాగా!" అన్నాడు మధు.

"అలా నా కిష్టంలేదు అంతే! అని వెనక్కు తిరిగిన భార్యను పైట పట్టుకు లాగాడు మధు. వెళ్ళబోయిన ఆమె వెనక్కి తూలింది. ఆమెను తన చేతుల్తో పట్టుకుని "మాధవీ! ప్లీజ్ ఇవాళనుంచి మీ ఇంటికి వెళ్ళడం మానెయ్యవా?" అన్నాడు.

ఒకసారి అతన్ని విదిలించి, అతనివేపు ఉరుముతున్నట్లు చూసి. "నా పల్లి కాదండీ?" ఆ లంకలో ఒంటరిగా వుండడానికి నేనేం సీత ననుకున్నారా," అంది.

"పోనీ- నీకేం కావాలో కాలక్షేపానికి అడుగు తెస్తాను" అన్నాడు మధు.

"నాకేం వద్దు- మీరేం తేవద్దుగానీ. మీరెళ్ళరండి మహాశయా?" అని వంటిం

ట్లోకి వెళ్ళిపోయింది.

ఇక లాభం లేదని విసురుగా లోన దిగుల్తో కదిలి రోడ్డున పడ్డాడు మధు.

ఆఫీసులో వర్క్ చేస్తున్నాడే కాని అతని ఆలోచనలు తన భార్య చుట్టూ పరిగెడుతున్నాయి. ఎలా ఆమెని ఆపడం. ఆమెకీ దిగుల్ని పోగొట్టి, ఒంటరితనాన్ని తరిమేయడం? ఎంత తల్లిదండ్రులయినా ఎంత ప్రేమ వున్నా మరీ ఇలా రోజూ వాళ్ళని చూడాలని వెళ్ళడం మధుకి నచ్చడం లేదు కాని అలా వెళ్ళకుంటే తనకి ఏం తోయడం లేదని, భయమేసుందనీ ఏడుస్తున్న మాధవిని చూస్తే జాలేసినా. ఆమె అలా పుట్టింటికి వెళ్ళడం మాత్రం అతనికి గొప్ప సమస్య అయికూర్చుంది.

మధు ఓ గవర్నమెంటు ఆఫీసులో అసిస్టెంట్ సూపర్‌వైజర్. తల్లీ, తండ్రీ వున్నా. ఉద్యోగరీత్యా తను విజయవాడ వస్తూ-వాళ్ళని వారి సొంత వూళ్ళోనే వుంచేశాడు తర్వాత ఒక ఏడాదికి అతనికి తల్లిదండ్రులు మంచి సంబంధం చూసి పెళ్ళి చేశారు. క్రొత్తగా కాపురం పెడుతూ తల్లినీ, తండ్రినీకూడా రమ్మన్నాడు కానీ, పుట్టి పెరిగిన వూరిని, తమ పూర్వీకుల ఆస్తి అయిన ఆ యిల్లు, వదిలిరామనీ, ఉన్న కొద్దిపొలం సాగు చేసుకుంటూ వుండిపోతామని కొడుకుకి నచ్చజెప్పి పంపించేశారు. మధు అత్తగారిది విజయవాడ. మధు బంధువొకాయన ఆ సంబంధాన్ని చూసి ఇతని తల్లిదండ్రులతో సంప్రదించి అందరి ఇష్టమ్మీద ఖాయ పరిచాడు

మధుకి పెళ్ళయి రెండు నెలలయింది. మధు ఉన్నత భావాలు గల ఓ సనాతన పొంగడూ కాదు సంస్కారం తెలియని చవటా కాదు కాని అతనికి నిశ్చయమైన అభిప్రాయాలు, శాశ్వతమైనపద్ధతులు మాత్రం కొన్ని వున్నాయి. అలా వాటితో ఎదుటి వారిని నొప్పించడంగానీ, ఏడిపించడంగానీ, ఇబ్బందిపెట్టడంగానీ అతని కలవాటు లేదు.

కాని, అతని భార్య సమస్యగా తయారయింది. చెప్పుకుంటే పెద్దసమస్యకాదు గానీ అతనికి కొద్దినిముషాలు అలా అనిపిస్తుంది. మళ్ళీ సాయంత్రం అయ్యేసరికి కథ మామూలే చిలకాగోరింకల్లా కిలకిలమంటూ నవ్వులతో ఈ లోకంలోనే స్వర్గాన్ని అనుభవించుకొనే స్వభావులు ఇద్దరూను!

అలాఅలా సాయంత్రందాకా ఆఫీసులో అతికష్టంగా గడిపి అయిదవగానే విల్లు విడిచిన బాణంలా పరుగులంకించుకొన్నాడు మధు. మార్గమధ్యంలో పూలుతీసుకొని, బస్ ఎక్కికూర్చున్నాడు. మళ్ళీ ఆలోచనా విహారం.

"ఎలా మాధవిని సంతృప్తిపరచడం? భలేవాడివేనే! సంతృప్తికాదు. ఆమె అలవాటుని మరో అలవాటుకి మళ్ళించడం? ఎలా? ఎలా?" ఆలోచిస్తున్న అతనికి బస్సు బ్రేకు పడడంతో వెనుక సీటులోని వ్యక్తి చేతిలోని పుస్తకం జారి మధు ముందు పడ్డంతో ఆగిపోయాయి.

"సారీ" అని పుస్తకాన్ని తీసుకొని "మరీ ఇంత పిచ్చి పనికిరాదు! కాసేపు ఆగలేవూ?" అంటున్న వెనక సీటులోకి చూశాడు మధు.

ఇద్దరూ భార్యాభర్తలనుకుంటా. ఆమె నవ్వుతూ "ప్లీజ్ - ఇవ్వండీ" అని సున్నితంగా లాక్కుంది అతని చేతిలోని పుస్తకాన్ని.

"ఊ! నాది బుద్ధితక్కువ కాలక్షేపం. కాలక్షేపం. అని అలవాటు చేశాను. అది ఇప్పుడు ఇప్పుడు తెలుస్తోంది."అని ముఖం మాడ్చుకున్నాడు.

ఇది విన్న మధు మనసులో తళుక్కుమని ఐడియా మెరిసింది. ఆనందంగా ముఖం వికసించింది. వెంటనే నెక్స్ట బస్‌స్టాపులో దిగిపోయి, చకచకా బుక్‌స్టాల్‌వైపు నడిచాడు. అటుత్రిప్పి ఇటు త్రిప్పి మొత్తం ఓ అరడజను నవల్సు మంచి సాహిత్యం- అంటే ఆడవాళ్ళని ఆకట్టుకునే రచయిత్రుల రచయితలవీతీసుకొని ఇంటిముఖం పట్టాడు

"మాధవీ....మాధవీ" అంటూ ఇంట్లోకి ఆత్రుతగా నడిచాడు.

"ఆగండీ! ఆగండీ! చీర మార్చుకుంటున్నాను" అంటూ అరిచింది మాధవి

"ఓకే! త్వరగా కానీ! నీకో సర్‌ప్రైజ్ న్యూస్! అంతేకాదు మంచి కాలక్షేపం. నా సమస్య నీ సమస్య తీరే ఉపాయం" అని అరుస్తూ పచార్లు చేస్తున్నాడు.

"ఏమిటో అంత వింత?" అంటూ వచ్చింది

"వింత కాదోయ్! చూడూ! నీకోసం ఎన్ని పుస్తకాలు తెచ్చానో! ఇంక నీ ఇష్టం రోజుకి ఎన్ని చదువుతావో," అంటూ




ముఖం నవ్వుతో సాగదీశాడు.

"ఏమిటేమిటి? ఇవన్నీ నా కోసమే! అబ్బ. యద్దనపూడి! వీరేంద్రనాథ్! ఆహా ఆహా" అంటూ ఆనందంగా భర్తని చూసింది.

"మరింకెవరికోసం తెస్తాను నీకోసమే కాఫీ ఏవన్నా ఇస్తావా లేదా!" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

"ఒక్క నిముషం" పుస్తకాలు మొత్తం మధ్య గదిలో పెట్టి ఓ పుస్తకం తీసుకొని వంటింట్లోకి వెళ్ళింది మాధవి.

ఆమె వెళ్ళి 30 నిముషాలు దాటుతున్నా రాకపోయేసరికి విసుగుతో లోనికి గెంతాడు మధు

వంటింట్లో మాధవి తన్మయత్వంగా, సీరియస్‌గా పుస్తక పఠనంలో వుంది. అది చూసిన మధుకి సంతోషమే కలిగింది. "ఆహా! ఏమి చదువు. పోనీలే ఇలాగయినా తన భార్యను మార్చగలిగాను!" అని ఆనందంగా నవ్వుకున్నాడు. కాఫీ విషయం వాయిదా వేసుకొని బైటకి వెళ్ళిపోయాడు.

"పాలు-పాలండీ" అంటూ పాలవాడి అరుపుకి ఈ లోకంలోకి వచ్చింది. మాధవి. "అబ్బబ్బ. వెధవ పాలూ, వీడూను ఇప్పుడే రావాలా!" అంటూ పుస్తకాన్ని మడత పెట్టి అప్పుడు చూసింది స్టవ్ పైన కాఫీ గిన్నె అడుగంటి వుండడాన్ని! "అయ్యో నా మతి మండ. ఆయనకు కాఫీ కూడా ఇవ్వలేదే. అలానే వెళ్ళిపోయారా! ప్చ్!" అంటూ స్టవ్ ఆర్పేసి, అడుగంటిన గిన్నెనీ, కొన్ని పాత్రల్ని తోమడం కోసం దొడ్డివైపు నడిచింది భర్త తెచ్చిన మల్లెపూలు తలలో తురుముకొని, మళ్ళీ పుస్తక పఠనంలో మునిగిపోయింది.

ఆసక్తికరంగా సాగుతూంది "యద్దనపూడి అగ్నిపూలు" సీరియల్ "మాధవీ! మాధవీ!" అంటూ ప్రవేశించాడు మధు.

"అబ్బబ్బా! ఏమిటండీ! మంచి సస్పెన్స్‌లో వున్నాను కొంచెం ఆగండి! వస్తున్నాను" అంది మాధవి పుస్తకం లోంచి ఒక క్షణం మాత్రం భర్తని చూసి.

ఆమె మాటలకి కించిత్ కూడా కోపం రాకపోగా, ఎక్కడలేని ఆనందం మధుని ఉక్కిరిబిక్కిరి చేసింది.

రాజ్యాన్ని జయించిన మహరాజులా, పది లక్షలు లాటరీ తగిలిన వ్యక్తిలా ఫీలయ్యాడు. అంతేకాని భార్యని కదిలించలేదు. ఆమెలో ఆ మార్పు అతనికి ఓ వింత అనుభూతి ఎంతో మనస్తాపం కలిగించాయి.

మాధవి ఏమీ వండలేదని వంట పాత్రల్ని చూసి నవ్వుకుంటూ, బట్టలు మార్చుకొని తానే వంట ప్రయత్నం ప్రారంభించాడు మధు.